క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత చంద్రకాంత్, అమృత దంపతులకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్ సునీల్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి అనకాపల్లికి చెందిన సున్నం చంద్రకాంత్, అమృత దంపతులు రూ.లక్ష 111 విరాళాన్ని సోమవారం అందించారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో సింహగిరి పైనున్న పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటర్‌లో అందజేశారు. దేవస్థానం తరఫున ప్రొటోకాల్ విభాగం సూపరింటెండెంట్ సునీల్ బాండ్ ఇచ్చారు. ఆలయ అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రంలను అందించారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ పల్లా నాగమణి, గ్రామ పెద్దలు

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ పరదేశిమాంబ ఆలయానికి వెళ్లే మార్గంలో పంచాయతీ నిధులు రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు సర్పంచ్ పల్లా నాగమణి, ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం సర్పంచ్ నాగమణి మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్లు, రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బలిరెడ్డి సంతోషి, యలమర్తి బుజ్జి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పల్లా అప్పారావు(కబడ్డీ), కవలపల్లి సత్యనారాయణ, ఎస్.శ్రీనివాసరావు, బి.వెంకునాయుడు, పి.వెంకునాయుడు, డి.పైడిరాజు, యు.నూకరాజు, పైడిరాజు, జె.అప్పారావు, పి.శేఖర్, జి.నాగార్జున, బి.నగేష్ పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు




కూండ్రపు కృష్ణంనాయుడు

పరవాడ: రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూండ్రపు కృష్ణంనాయుడు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లలో అవకాశాలు కోల్పోతారన్నారు. దేశంలో 140 కోట్ల జనాభాకు తగ్గట్టుగా వైద్యులు లేరన్నారు. కోవిడ్ సమయంలో వైద్యులు లేక ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రానికి ప్రభుత్వ వైద్య కళాశాలలు ఎంతో అవసరమన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడు అరెస్టు

- 29.20 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం



మాట్లాడుతున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్

అనకాపల్లి టౌన్: పట్టణం, మండలంలోని చోరీలకు పాల్పడిన దొంగను అరెస్ట్ చేసి, రూ.3 లక్షల విలువ చేసే 29.20 గ్రాముల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. పరవాడ మండలం కన్నూరు గ్రామానికి చెందిన గేదెల రాజశేఖర్ పెయింటింగ్ పనులు చేసుకుంటూ చోరీలకు పాల్పడుతున్నాడు. మే నెలలో గాంధీనగరం ఇన్‌కమ్ ట్యాక్స్ వీధిలో కొమ్మోజు రాజేశ్వరి ఇంట్లో నాలుగున్నర తులాల చైను, రెండు జతల చెవిదిద్దులు, నాలుగు బంగారు గాజులు, పిసినికాడ గ్రామంలో మల్ల నూక అప్పారావు ఇంట్లో అరతులం బంగారం ఉంగరాన్ని దొంగిలించాడు. రెండిళ్లలోనూ తాళాలు విరగొట్టి చోరీలకు పాల్పడ్డాడు. ఈ రెండు దొంగతనాలకు సంబంధించి ఒక బంగారు చైన్, రెండు జతల బంగారు చెవిదిద్దులు, ఒక బంగారు ఉంగరం, మొత్తం 26.43 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడి నుంచి స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. పట్టణ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



వెన్నలపాలెం కూడలిలో ట్రాఫిక్ సమస్యలు



సబ్‌స్టేషన్ కూడలిలో భారీ వాహనాలతో ప్రయాణికుల ఇబ్బందులు

అధ్వాన రోడ్లు.. ట్రాఫిక్ ఇక్కట్లు

గాజువాక–యలమంచిలి రహదారిలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు వేధిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో భారీ వాహనాలతో తరచూ తలెత్తుతున్న ట్రాఫిక్ ఇక్కట్లకు ఫార్మా, ఎన్టీపీసీ ఉద్యోగులు, కార్మికులు, సాధారణ ప్రయాణికులు నరక యాతన పడుతున్నారు. ఈ రహదారిలో ఊటగెడ్డ, వెన్నలపాలెం సినిమాహాలు, విద్యుత్ సబ్‌స్టేషన్ కూడళ్ల వద్ద తరచూ ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడం, భారీ గుంతలు, పెరిగిన వాహనాల రద్దీ ఈ పరిస్థితికి కారణం.

- గాజువాక–యలమంచిలి రోడ్డులో నిత్యం నరకం
- ఇరుకు రోడ్లు, భారీ వాహనాలతో ట్రాఫిక్ జామ్
- ఛిద్రమైన రోడ్లతో వాహనదారుల అవస్థలు

పరవాడ: ఎన్టీపీసీ, ఎస్ఈజెడ్, హిందూజా పరిశ్రమలకు రాకపోకలు సాగించే భారీ వాహనాలు గాజువాక–యలమంచిలి రహదారిలో పరవాడ మండల కాంప్లెక్సు, విద్యుత్ సబ్‌స్టేషన్, వెన్నలపాలెం సినిమాహాలు, ఊటగెడ్డ కూడళ్ల మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ సంస్థల్లో పనిచేసే వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు, గాజువాక, పరవాడ, స్టీల్‌ప్లాంట్ తదితర ప్రాంతాల్లోని విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులను తీసుకెళ్లే స్కూల్/కాలేజీ బస్సులకూ ఇదే ప్రధాన మార్గం. మండల కేంద్రం పరవాడలోని ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్ పనులపై వివిధ గ్రామాల నుంచి రాకపోకలు సాగించే ప్రజలు కూడా ఈ కూడళ్ల మీదుగా ప్రయాణిస్తుంటారు. దీంతో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

తరచూ ప్రమాదాలు

వాహన రద్దీ ఎక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తరచూ ఏర్పడుతున్నాయి. భారీ వాహనాలను తప్పించుకునే ప్రయత్నంలో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో ఊటగెడ్డ కూడలి వద్ద భారీ వాహనాన్ని తప్పించే క్రమంలో ఓ ద్విచక్ర వాహనదారుడు ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఈ కూడలిలో రోడ్డు పక్కన నిలిపిన లారీలను గుర్తించకుండా వాటిని ఢీ కొన్న ఘటనలో వాడచీపురుపల్లి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. మిగిలిన కూడళ్ల వద్దా.. తరచూ ఏదో ఒక ప్రమాదం జరగడం పరిపాటిగా మారింది.

విస్తరణకు నోచుకోక..

గాజువాక– యలమంచిలి రహదారి విస్తరణకు నోచుకోకపోవడం, రోజురోజుకూ పెరుగుతున్న వాహనాలతో రోడ్డు ఇరుగ్గా మారింది. రెండు భారీ వాహనాలు తప్పించుకునే క్రమంలో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఆ సమయంలో పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలోని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ యంత్రాంగం కనీస చర్యలూ చేపట్టని పరిస్థితి. రద్దీగా ఉన్న కూడళ్ల వద్ద పోలీస్ బీట్లను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నా.. పట్టించుకునే పరిస్థితి లేదు.

అధ్వాన రోడ్లతో అవస్థలు

నిత్యం రాకపోకలు సాగిస్తున్న బూడిద, బొగ్గు లారీలు, పరిశ్రమలకు చెందిన మెటీరియల్ తరలించే భారీ వాహనాలతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. భారీ గుంతలు ఏర్పడి వర్షాకాలంలో రోడ్డేదో.. గొయ్యేదో తెలియని పరిస్థితి. రోడ్ల మరమ్మతులకు స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా.. చర్యలు శూన్యం. యలమంచిలి–లంకెలపాలెం రహదారిలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు మండల కాంప్లెక్సు వద్ద మలుపు తిరుగుతున్న క్రమంలో పల్టీలు కొట్టడడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.



సబ్‌స్టేషన్ కూడలిలో ధ్వంసమైన రహదారి



ఊటగెడ్డ కూడలిలో గుంతలమయంగా మారిన రోడ్డు



ఊటగెడ్డ కూడలిలో భారీ వాహనాలతో ట్రాఫిక్ కష్టాలు

ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలి



యలమంచిలి–గాజువాక రహదారిలో ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ బీట్లను ఏర్పాటు చేస్తే కొంత ప్రయోజనం ఉంటుంది. రహదారిలో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్యలు ఎక్కువ. చాలా ఇబ్బందులు పడుతున్నాం. ముందే ఇరుకు రోడ్డు, ఆపై భారీ వాహనాలతో ప్రయాణం కష్టమవుతోంది. రోడ్డు విస్తరణ చర్యలు తీసుకోవాలి.

– కడవల అప్పలనాయుడు, ఊటగెడ్డ కూడలి

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



భారీ వాహనాలతో అధ్వానంగా మారిన గాజువాక–యలమంచిలి రహదారితో అవస్థలు పడుతున్నాం. ఛిద్రమైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. గుంతలమయంగా మారిన రోడ్డులో రాత్రుళ్లు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాం. వర్షాకాలంలో మరీ ఇబ్బందిగా ఉంటోంది. గుంతల్ని తక్షణమే పూడ్చాలి. మండల కాంప్లెక్సు కూడలి వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– శ్రీనివాసరావు, పరవాడ మండల కాంప్లెక్స్ కూడలి



ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



కార్ గ్యారేజ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పెందుర్తి: వృత్తివిద్యలో భాగంగా సెలవుల్లో అందిస్తున్న ఇంటర్న్‌షిప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ చిన్నమ్మాయి సూచించారు. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా వృత్తివిద్యకు ఎంపికైన విద్యార్థులకు పలు కార్ గ్యారేజీల్లో సోమవారం శిక్షణ అందించారు. కార్యక్రమంలో వృత్తివిద్య శిక్షకుడు పి.మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

త్రీడీ రంగంలో చక్కటి ఉపాధి



త్రీడీ ప్రింటింగ్‌పై అవగాహన కలిగిస్తున్న ట్రైనర్ ప్రకాష్

పెందుర్తి: త్రీడీ రంగంలో అత్యున్నత స్థాయి ఉపాధి అవకాశాలు ఉన్నాయని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. ద్వితీయ సంవత్సరం మెకానికల్ విద్యార్థులకు కళాశాలలోని స్కిల్ హబ్‌లో సోమవారం త్రీడీ ప్రింటింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. డైనో పీటీఎస్ ప్రతినిధి ప్రకాష్ విద్యార్థులకు శిక్షణ అందించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి బి.రామసుధీర, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవన శైలిపై బాలింతలకు అవగాహన



బాలింతలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త యడ్ల లక్ష్మి, తదితరులు

సబ్బవరం: మండలంలోని మొగలిపురం బండిమాంబ గుడి సమీపంలో ఉన్న మొగలిపురం–2 అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సుపోషిత్ భారత్–సక్షం భారత్ కార్యక్రమం ద్వారా పోషకాహార భద్రత, ఆరోగ్యకరమైన జీవన శైలిపై బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అదే విధంగా మూడేళ్ల లోపు పిల్లలకు ప్రేరణతో కూడిన అభివృద్ధిలో భాగంగా పోషణతో కూడిన విద్య గురించి వివరించారు. కార్యక్రమంలో సబ్బవరం ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి, సూపర్‌వైజర్ ఇందిర, అంగన్‌వాడీ కార్యకర్త యడ్ల లక్ష్మి, పుచ్చ పైడితల్లమ్మతో పాటు బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.



శారదాపీఠంలో అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న స్వామీజీ



పెందుర్తి అయ్యప్ప ఆలయంలో స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా..



సుజాతనగర్లో బాలాత్రిపుర సుందరిగా కనకదుర్గమ్మ



స్వర్ణ కవచాలంకారంలో ఎస్ఆర్‌పురంలోని దుర్గమ్మ



శ్రమశక్తినగర్‌లో రజత కవచాలంకరణ మహాగాయత్రిగా..



త్రిపురాంతకస్వామి ఆలయంలో బాలాత్రిపురసుందరీదేవి



విజినిగిరిపాలెంలో బాలాత్రిపుర సుందరిదేవిగా ఉమాదేవి

బాలాత్రిపురసుందరీం.. సర్వతత్వాత్మకాం



కోట్నివానిపాలెంలో బాలాత్రిపురసుందరిగా దుర్గమ్మ

లోక కంటకుడైన మహిషాసురుడ్ని సంహరించేందుకు అమ్మవారు తొమ్మిది అవతారాలు ధరించారని పురాణ ప్రతీతి. ఏటా ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి మొదలు నవమి వరకు దేవీ శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తారు. దుర్గాదేవిని వివిధ రూపాలతో అలంకరించి షోడశోపచారాలతో పూజిస్తారు. మనసు, బుద్ధి, చిత్తం, అహంకారాలను తన అధీనంలో ఉంచుకున్న శక్తి.. బాలా త్రిపుర సుందరీదేవి. తొలిరోజైన సోమవారం నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా, స్వర్ణ, రజత కవచాలంకృత దుర్గమ్మగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు.

- వైభవంగా మొదలైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఊరూవాడా అమ్మవారి ఆలయాల్లో భక్తుల కిటకిట

పెందుర్తి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఊరూవాడా మండపాల్లో దుర్గమ్మ కొలువుదీరింది.

- సుజాతనగర్ అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ బాలా త్రిపురసుందరిదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.
- చినముషిడివాడ పంచముఖ గాయత్రిమాత ఆలయంలో భారీఎత్తున కుంకుమార్చన, పంచామృతాభిషేకాలు చేశారు. రజత కవచాలంకారంలో మహాగాయత్రిగా అమ్మవారు పూజలందుకున్నారు.
- సప్తగిరినగర్ అలివేలు మంగమ్మ ఆదిలక్ష్మిగా దర్శనమిచ్చారు.
- పెందుర్తి మహాకామేశ్వరీ ఆలయంలో అమ్మవారికి రజత కవచాలంకరణ చేశారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు.
- ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అమ్మవారు పూజలందుకున్నారు. ముందుగా ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో 108 కలశాల ఊరేగింపుతో మహిళలు ఆలయం వద్దకు తరలివెళ్లారు. భవానీ భక్తులకు బిక్ష ఏర్పాటు చేశారు.
- చినముషిడివాడలోని శారదాపీఠంలో అమ్మవారికి పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అభిషేకాలు చేశారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి పూజలు చేశారు. బాలాత్రిపురసుందరి దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.
- పెందుర్తి అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో దుర్గాదేవి స్వర్ణకవచాలంకరణలో దర్శనిమిచ్చారు.
- సూర్యనగర్ సంపత్ వినాయక ఆలయంలోని గౌరీదేవి ఆలయంలో కుంకుమ పూజలు జరిపారు.
- పాపయ్యరాజుపాలెంలో దుర్గాదేవి కొలువుదీరింది. వైఎస్సార్‌సీపీ నేత గండి రవికుమార్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భక్తులు పూజలు జరిపారు.
- కోట్నివానిపాలెంలో బాలాత్రిపురసుందరిదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

సింహాచలం: 98వ వార్డు పరిధిలో అడవివరంలోని ఆయిల్ మిల్ వద్ద గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దుర్గాదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. పూజల్ని అర్చకుడు రామకృష్ణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. బాలాత్రిపురసుందరీదేవిగా అమ్మవారికి అలంకరణ చేశారు. గణేష్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు అమ్మవారికి తొలిపూజ నిర్వహించారు.

- గాంధీనగర్‌లో హనుమాన్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో భారీ మండపం ఏర్పాటుచేసి అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పారు. తొలిరోజు అమ్మవారికి బాలాత్రిపురసుందరీదేవి అలంకరణ చేశారు.
- విజినిగిరిపాలెంలోని ఉమాదేవి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.
- అప్పన్నపాలెంలో కొలువుదీరిన భూలోకమాంబ ఆలయంలో శరన్నవరాత్రి సహిత మహా చండీ హోమ దివ్య మహోత్సవాలు ప్రారంభమయ్యాయి.
- సింహపురికాలనీ ప్రధాన ఆర్చ్ వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలో స్థానిక ఆటోస్టాండ్ డ్రైవర్ల ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

త్రిపురాంతకస్వామి ఆలయంలో..

సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బాలాత్రిపుర సుందరీదేవికి 22 సహస్రనామార్చనలు, కుంకుమపూజ, సాయంత్రం సుహాసినీ పూజలు ఘనంగా జరిపారు. ఆలయ అర్చకుడు రమణమూర్తి, వేదపండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయదశమితో లక్షనామాల పూజ పూర్తవుతుందన్నారు.

పరవాడ: స్థానిక బొంకులదిబ్బ యూత్, యంగ మెన్స్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి పైల శ్రీనివాసరావు దంపతులు, సంతబయలు వద్దవైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చుక్క రామునాయుడు దంపతులు దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, పెద్దలు పాల్గొన్నారు.

- తానాంలో ఆదర్శ మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి విగ్రహాన్ని సర్పంచ్ కన్నూరి దేవివెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు ప్రతిష్ఠించారు.
- వెన్నలపాలెంలో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు బండారు అప్పలనాయుడు జరిపారు. గ్రామ పెద్దలు ఏకుల అప్పారావు, పైల రత్నాల సన్యాసిరావు, వెన్నల సన్యాసిరావు, లోకిరెడ్డి అబ్బీనాయుడు, పైల వరలక్ష్మి పాల్గొన్నారు.
- దేశపాత్రునిపాలెం శివారు జాజులవానిపాలెంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాళీమాత విగ్రహం వద్ద ప్రజలు ప్రత్యేక పూజలు జరిపారు.

దేవీపురంలో దసరా బ్రహ్మోత్సవాలు



గోమాత పూజతో బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న మహిళా భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో దసరా బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే గోమాత పూజతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో శ్రీయంత్ర మహామేరు ఎదురుగా ఉన్న సాధనశాలలో 28 ప్రత్యేక కలశాలను పవిత్ర నదీ జలాలతో నింపి వేద మంత్రాలతో కలశ స్థాపన చేశారు. మొదటి అంతస్తులో దక్షిణ కాళీ అమ్మవారిని వేదికపై అలంకరించి అష్టోత్తర పూజలు, లలితా సహస్ర నామ, చండీ పారాయణాలు గావించారు. రాత్రి 9 గంటల నుంచి హోమం ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా వరంగల్ నుంచి వచ్చిన సుధీర్‌రావు ఆధ్వర్యంలో శివానంద నృత్యమాలకు చెందిన 10 మంది విద్యార్థులతో కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మధ్యాహ్నం గురుమాత అన్నపూర్ణమ్మ చేతుల మీదుగా భారీ అన్నసమారాధన ప్రారంభించారు.



పాపయ్యరాజుపాలెంలో పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేత గండి రవి, స్థానిక నాయకులు



అడవివరంలోని ఆయిల్‌మిల్ వద్ద..



తానాంలో దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠలో సర్పంచ్..



సంతబయలులో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠలో..



జాజులవానిపాలెంలో సామూహిక పూజలు



పరవాడ బొంకులదిబ్బ వద్ద..